నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి -హుకుంపేట: ఉచిత నైపుణ్య అభివృద్ధి శిక్షణ ద్వారా ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంజిఎన్ఆర్ఐ జిపి ఏపీవో కె.లింగమూర్తి మంగళవారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సీడ్ ఆఫ్ డి.డి.యు జీ.కే.వై ద్వారా ఉచిత నైపుణ్య అభివృద్ధి శిక్షణకు వివిధ రంగాల్లో కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్, ఆటోమేటికల్స్ రంగంలో శిక్షణ కల్పించి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తామని, ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన వసతి సౌకర్యం ఉంటుందన్నారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పని దినాలు పూర్తిచేసి ఉన్న కుటుంబ సభ్యులు ఉన్న నిరుద్యోగులకు ఈ అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఎంపిక ప్రక్రియను ఈనెల 26న గ్రామ సచివాలయం, సుంద్రుపుట్టు, పాడేరులో జరుగుతుందన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

▸▸సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స ▸▸ముగిసిన పార్టీ జిల్లా చైతన్య యాత్ర

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పల నర్స రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్ర ముగింపులో భాగంగా పాడేరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రజలతో ధర్నా నిర్వహించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఏవోకి గ్రామాల్లో సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. పాడేరు మండలం సిపిఎం కార్యదర్శి ఎల్.సుందరరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా ను ఉద్దేశించి అప్పలనరస మాట్లాడుతూ, మార్చి 8 నుండి 25 వరకు గ్రామ పర్యటనలు నిర్వహించి ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి అర్జీలు సమర్పించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు యాత్ర నిర్వహించామన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు డివిజన్లో 11 మండలాల పరిధిలో సుమారు 2020 గ్రామాలకు ప్రజా చైతన్య యాత్ర బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటన నిర్వహించాయని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా నేటికీ గ్రామాల్లో ఉమ్మడి, వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు కేటాయించలేదని విమర్శించారు. గ్రామాల్లో ఇల్లు స్థలం లేని పేదలకు ప్రభుత్వం తక్షణమే స్థలం కేటాయించాలని, ఇల్లు లేని వారికి ఇల్లు మంజూరు చేయాలని కోరారు. పీఎం జన్మన్ స్కీం కింద మంజూరు చేస్తున్న ఇళ్లకు యూనిట్ కాస్టు 10 లక్షల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. తాగునీరు, పెన్షన్లు తదితర సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు చెక్ డ్యాం నిర్మాణం చేపట్టాలన్నారు. పి.ఎం కిసాన్ కొంత మందికి ప్రభుత్వం రాయితీ అందడం లేదని, ఉపాధి పనులు ప్రారంభం తక్షణం చేయాలన్నారు. పనులు చేసిన వారికి డబ్బులు చెల్లించలేదన్నారు.అటవీ హక్కు పత్రాలు ఇవ్వకుండా తీవ్రమైన అన్యాయం చేస్తున్నారన్నారు. రేషన్ కార్డులు, పించన్ల మంజూరు కోసం ప్రభుత్వం కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఉంటే కనీసం అధికార్లు స్పందించ లేదని తెలిపారు. గ్రామాల్లో రోడ్, డ్రైనేజ్, తాగునీరు, వీధి దీపాలు సమస్యలతో కొట్టిమిట్టాడున్నాయని, ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని విమర్శించారు.

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. లక్కు మాట్లాడుతూ పాడేరు మండలంలో రేషన్, పెన్షన్‌పాటు కాఫీ మిరియాలు రైతులకు ఉచితంగా నిచ్చెనలు, పల్పింగ్ మిషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత్యోదయ కార్డు దారులకు 35 కేజీల బియ్యం పునరుద్ధరణ చేయాలని, రోడ్డు నిర్మాణానికి ఫారెస్ట్ అధికారుల ఆటంకాలు తొలగించాలన్నారు. వనుగుపల్లి, మోదపల్లి, మినుములురు, చింతలవీధి, గుత్తులపుట్టు, ఇరడా పల్లి, బడిమేల, డోకూలూరు వంతాడపల్లి పంచాయతీలకు గ్రామాలకు మంచినీరు, సిసి రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో కార్యాలయం ఏవో మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులు పరిశీలించి సత్వరమే స్పందించి పరిష్కారం చేస్తామని, తమ పరిధిలో లేని మిగిలిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి తెలియజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు వంతల దాస్, మండల నాయకులు.బొజ్జన్న, సతీష్, గణేష్, మహేష్, సుందరరావు, నగేష్, కృష్ణ, రాజు, వాసు, శివలు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ఆర్టీసీ అధికారులతో జెడ్‌పిటిసి, వివిధ పార్టీల నాయకులు

విజయవాడ-రేఖపల్లి బస్సు ఏర్పాటుకు రూట్ సర్వే

ప్రజాశక్తి-విఆర్.పురం

విఆర్.పురం, కూనవరం మండలాల ప్రజలు ఎప్పటి నుంచో కోరుకుంటున్న విజయవాడ- రేఖపల్లి బస్సు సర్వీసు ఏర్పాటుకు మార్గం సుగమం అయినట్టే. విజయవాడ ఏపీఎస్ ఆర్టీసీ డిపిడిఒ ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు మంగళవారం కూనవరం నుండి రేఖపల్లి వరకు రూట్ సర్వే చేశారు. అనంతరం రేఖపల్లి సచివాలయంలో జడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, సిపిఎం నాయకులు, స్థానిక నాయకులు పెద్దలతో ఆర్‌టిసి అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ విజయవాడ నుండి రేకపల్లి వరకు బస్సు ఏర్పాటు చేయాలని, విజయవాడ నుండి ఉదయం 11 గంటలకు ఒక బస్సు, రాత్రి 10.15 గంటలకు మరో బస్సు రేఖపల్లి వచ్చే విధంగా, రేఖపల్లి నుండి ఉదయం 7 గంటలకు ఒక బస్సు, రాత్రి 7.40 గంటలకు ఒక బస్సు విజయవాడ బయలు దేరే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన అధికారులు ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పివి.రావు, కండక్టర్ కె.శ్రీనివాసరావు, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, టిడిపి మండల అధ్యక్షులు బర్కపాటి ప్రకాశరావు, వైసిపి నాయకులు పోడియం గోపాల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎ.లీలాకృష్ణ, టిడిపి నాయకులు బురక కన్నారావు, బీరక సూర్యప్రకాష్. మామిడి రాజు, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు ప్రారంభించేదెన్నడో?

-నెట్‌వర్క్ సౌకర్యానికి దూరంగా గిరిజన గ్రామాలు
-సిగ్నల్స్ కోసం కొండలు, గుట్టలు ఎక్కాల్సిందే..

ప్రారంభం కాని సెల్ టవర్.

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అల్లూరి జిల్లా అరకులోయ మండలం పద్మాపురం మేజర్ పంచాయతీ పరిధి దుమ్మగూడ, దమ్మగూడ కాలని, పింపోలుగుడ, శారద భోందుగూడతో పాటు వివిధ గ్రామాల్లో నెట్‌వర్క్ సౌకర్యం ఉండడం లేదు. దుమ్మగూడ ప్రాంతంలో రెండు బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు నిర్మాణం పూర్తి అయి 6 నెలలు కావస్తున్నా నేటికీ ప్రారంభించక పోవడంతో సెల్ సిగ్నల్ కోసం నానా పాట్లు పడుతున్నారు. దీంతో, సెల్ ఫోన్లు సరిగ్గా పనిచేయలేదు. సిగ్నల్స్ కోసం గిరిజనులు కొండలు, గుట్టలు ఎక్కి దిగాల్సి వస్తోంది. కిలోమీటర్ల మేరకు నడిచి సిగ్నల్స్ ఉన్న చోటకు చేరుకోవాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లు, రేషన్ సరుకులు, ప్రభుత్వం మంజూరు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న ఇల్లు సర్వేలు, పీఎం కిసాన్, ఈకేవైసీ కోసం నానా అవస్థలు పడాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు. దీర్ఘకాలికంగా ఈ సమస్య వేధిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. గిరిజన ప్రాంతాల్లో నెట్‌వర్క్ సౌకర్యం కల్పనకు కనీస చర్యలు తీసుకోలేదని విమర్శలు వస్తున్నాయి. కొన్నింటి నిర్మాణాలు పూర్తయినా. వాటికి అవసరమైన సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడం వల్ల వృథాగా పడి ఉన్నాయి. దీంతో సెల్‌ఫోన్లకు సిగ్నల్స్ ఉండడం లేదు.

అత్యవసర వేళల్లో గిరిజనులు పడరాని పాట్లు పడవలసిన పరిస్థితి నెలకొంది. సెల్‌ఫోన్ సిగ్నల్స్ కోసం కొండలు, చెట్లు ఎక్కాల్సి వస్తోంది. రేషన్ సరుకులు, పింఛన్లు, విద్యార్థుల బయోమెట్రిక్, ఉద్యోగులు ఫేస్‌యాప్ వంటి ఆన్‌లైన్ సర్వీసులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఆన్‌లైన్ సేవలు పొందాలంటే సిగ్నల్స్ ఉన్న ప్రాంతానికి ఉద్యోగులు, గిరిజనులు తరలి వెళ్లాల్సి వస్తోంది.

బయోమెట్రిక్ కోసం సిగ్నల్ ప్రాంతంలో పడిగాపులు కాస్తున్న గిరిజనులు

సెల్ సిగ్నల్ లేక ఇబ్బందులు పడుతున్నాం

అత్యవసర పరిస్థితుల్లో ఎవరికైనా ఫోన్ చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కిలోమీటర్లు నడిచి సెల్ సిగ్నల్స్ ఉన్న చోటకు వెళ్లాల్సి వస్తోంది.రేషన్ సరుకుల కోసం ప్రతినెలా సిగ్నల్ ఉన్న చోటకు వెళ్లాల్సి వస్తోంది.పంచాయితిలో కొన్ని గ్రామాల్లో సెల్ సిగ్నల్స్ ఉండడం లేదు. దీంతో ప్రతినెలా ఈ అవస్థలు తప్పడం లేదు.తక్షణమే అధికారులు ,ప్రజాప్రతినిధులు స్పందించి నూతనంగా నిర్మించిన సెల్ టవర్లు ప్రారంభించాలి.

జన్ని భగత్ రామ్,
ఉప సర్పంచ్

నవోదయ సీట్లు సాధించిన సెయింట్ మేరీస్ విద్యార్థులు

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు 2024-25 నవోదయ ఫలితాల్లో సీట్లు సాధించారు. మంగళవారం విడులైన నవోదయ ఫలితాల్లో సెయింట్ మేరీస్‌లో 5వ తరగతి చదువుతున్న దుర్గాస్వాగత్, గీతా మాధురి అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మినిమోల్ మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ పాఠశాల విద్యార్థులు నవోదయలో అర్హత సాధించడం తమ పాఠశాల విద్యా ప్రమాణాల స్థాయిని తెలుపుతున్నాయని తెలిపారు. ఎంఈఓ పి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఇద్దరు విద్యార్థులను అభినందించారు.

సీట్లు సాధించిన దుర్గాస్వాగత్, గీతా మాధురి

ఎమ్మెల్యేకు సమస్యలు చెపుతున్న గ్రామస్తులు

గ్రామానికి రోడ్డు వేయించండి

-ఎమ్మెల్యేకు అంజలి శనివారం గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి-చింతపల్లి : మా గ్రామానికి రోడ్డు వేయించండి ఎమ్మెల్యే గారు అంటూ అంజలి శనివారం గ్రామస్తులు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ముందు మొరపెట్టుకున్నారు. మంగళవారం ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు ఆ గ్రామంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ తరుణంలో ఆయన తిరుగు ప్రయాణం అవుతుండగా అంజలి శనివారం గ్రామస్తులు ఆయనకు సమస్యలు ఏకరువు పట్టారు. ప్రభుత్వాలు మారుతున్నాయి ఎమ్మెల్యేలు మారుతున్నారు తప్ప తమ ఊరికి రోడ్డు రా లేదని ఆ గ్రామస్తులు ఆవేదనను వ్యక్తం చేశారు. తమ గ్రామానికి రోడ్డును వేయాలని, ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గ్రామస్తులు కోరారు. దీంతో, ఎమ్మెల్యే అక్కడికక్కడే జిల్లా కలెక్టర్, ఈఈ, డీఈ లతో మాట్లాడి ఆ గ్రామ ప్రజల సమక్షంలోనే రోడ్డును వెంటనే ప్రారంభించాలని కోరారు. రోడ్డు పనులను జాప్యం లేకుండా చూస్తానని దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంగళరావు, స్థానిక సర్పంచ్ రాజబాబు, స్థానిక నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను ప్రాధాన్యత గ్రామాలుగా గుర్తించాలి

సిపిఎం మండల కార్యదర్శి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలో ప్రతి ఏటా గోదావరి వరదలు, పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ముంపునకు గురవుతున్న ప్రాంతాలను ప్రాధాన్యత గ్రామాలుగా గుర్తించాలని సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సంతోష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో జల్లివారి గూడెం, సున్నంవారిగూడెం, చిన్నమట్టపల్లి, నూతిగూడెం, గుర్రంపేట, ఉమ్మడివరం, అన్నవరం, రేకపల్లి, తోటపల్లి తదితర గ్రామాలు ప్రతి ఏటా ముంపునకు గురవుతున్నాయని, వాటిని ముంపు ప్రయారిటీ గ్రామాలుగా గుర్తించి తక్షణమే అన్ని రకాల సర్వేలు చేసి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కొన్ని గ్రామాల్లో భూములు, ఇళ్లు మునిగిపోతుండగా, మరికొన్ని గ్రామాల్లో ఇళ్లు ముంపునకు గురికాకపోయినా, భూములన్నీ మునిగిపోయి పంటలను కోల్పోతున్నారని తెలిపారు. తక్షణమే సంబంధిత అధికారులు ఈ గ్రామాలను 41.15 కాంటూర్ పరిధిలో చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి ముంపు గ్రామాలకు న్యాయం చేయకపోతే త్వరలోనే అన్ని గ్రామాల నిర్వాసితులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, మండల కమిటీ సభ్యులు పోడియం శ్రీరామ్మూర్తి, పంకు సత్తిబాబు, గుండుపూడి లక్ష్మణరావు, వడ్లది రమేష్, శ్రీరపు తాతబాబు, కొమ్మసిచ్చు సత్యనారాయణ, కారం సుందరయ్య, తుర్రం బాబురావు, కారం సత్తిబాబు, కదల కొండయ్య రెడ్డి, తోడం రాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని కోతులగుట్ట కస్తూరిబాయ్ గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కెజిబివి ప్రిన్సిపాల్ సున్నం స్వరాజ్యం తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి బాలికలకు 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం హెచ్ఇసిలో 40 సీట్లు ఉన్నట్లు చెప్పారు. 6 నుండి 10 తరగతులు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలో భోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశాలకు ఈ నెల 22 నుండి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్లైన్ పద్ధతిలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8008586138, 9640162227, 9493747084 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఆన్లైన్ దరఖాస్తు కొరకు ఏపీ కేజీబీవీ వెబ్ సైట్‌లో సంప్రదించాలన్నారు.

1 నుండి ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఏప్రిల్ ఒకటి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపల్ వి శంకర్రావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు తమ హాల్ టికెట్టు, ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ ఒకటి నుంచి ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రభుత్వ నిబంధన ప్రకారం తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్

సర్వేను సక్రమంగా చేయాలి

ప్రజాశక్తి-హుకుంపేట: -మండలంలోని తాడిపుట్టు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సచివాలయం సిబ్బందితో సర్పంచ్ సోమేలి సత్యవతి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తప్పులు లేకుండా సక్రమంగా సర్వే నిర్వహించాలని సచివాలయం సిబ్బందికి ఆమె సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పి 4 సర్వేను చేయాలని, గ్రామస్తులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తెలిపారు. గ్రామాలలో నాలుగు రకాలుగా సర్వే నిర్వహించాలని ఆమె పేర్కొన్నారు.ప్రతి ఇంట కుటుంబంలో జీవన స్థితిగతులు, వాటి వివరాలపై సమగ్ర సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వరలక్ష్మి వైస్ సర్పంచ్ సిదారి శోభన్ బాబు వార్డు సభ్యులు కిరసాని సుబ్బారావు, తూబూరు వసంతకుమారి తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి సోమేలి లక్ష్మయ్య, పిశా ఉపాధ్యక్షులు అదేరి రాంబాబు, బొర్గం కొండబాబు, పీసా సెక్రటరీలు ఆనంద, విజయభాస్కర్ నాయుడు, ఒలుగు సూరిబాబు, డివి రోజా రాణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ సత్యనారాయణ పడాల్, మహిళా పోలీస్ దివ్య, విఏవో మత్య లింగం పాల్గొన్నారు.

దేవీపట్నం సర్పంచ్ రాజమణికి సత్కారం

ప్రజాశక్తి-దేవీపట్నం : దేవీపురం పంచాయతీ సర్పంచ్ కుంజం రాజమణిని మండలంలోని ఏనుగుల గూడెం గ్రామస్తులు మంగళవారం సత్కరించారు. ఏనుగులగూడెం గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు గ్రామ దేవత ఆలయ అభివృద్ధి పనులు చేయించడంతో ఆ గ్రామస్తులు ఆమెను పూలదండ శాలువాతో సత్కరించి, చీర రవిక అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 2018-19 సంవత్సరంలో సొంత గ్రామాలను వదిలి పునరాసకాలనీ ఇందుకూరు-వన్ వచ్చామని, నాలుగు సంవత్సరాల నుండి తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, ఈ సమస్యను సర్పంచ్ రాజమణి తీర్చారని తెలిపారు. అలాగే గ్రామాల్లో ఉన్న గ్రామదేవత తోటపల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులు చేశారని, తమ గ్రామానికి మరిన్ని అభివృద్ధి పనులు చేయాలని కోరారు. సర్పంచ్ రాజమణి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు తమ పంచాయతీ పాలకవర్గ సభ్యులంతా కలిసి తీర్మానం చేసి గ్రామపంచాయతీ నిధులతో చేస్తున్నట్లు చెప్పారు.

సర్పంచ్ రాజమణిని సత్కరిస్తున్న ఏనుగుల గూడెం గ్రామస్తులు

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ భాస్కరరావు

పాఠశాలలో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రంలోని ఎంపిపి పాఠశాల, భవిత కేంద్రాన్ని పాడేరు ఎఎంఒ కె.భాస్కరరావు మంగళవారం సందర్శించి తనిఖీలు చేశారు. ఎంఈఓ పి.శ్రీనివాసరావుతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు సలహాలు ఇచ్చారు. భవిత స్పెషల్ నీడ్ పిల్లలకు తప్పనిసరిగా మంచి నైపుణ్యంతో కూడిన విద్యను ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ కుమార్

విధుల పట్ల బాధ్యతగా మెలగాలి

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని 22 సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది బాధ్యతగా మెలగాలని స్థానిక ఎంపీడీవో ఏవివి కుమార్ దిశా నిర్దేశం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద డిజిటల్ అసిస్టెంట్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధులకు డుమ్మా కొట్టిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సచివాలయంలో 11 రకాల రిజిస్టర్ పట్టికలు క్రమం తప్పకుండా అందుబాటులో ఉంచాలన్నారు. అధికారులు తనకి నిమిత్తం వచ్చినప్పుడు అవసరమైన రిజిస్టర్లు చూపాలని సూచించారు. ప్రతిరోజు 10 కి పైగా ప్రజల నుండి అర్జీలు నమోధు చేయించుకోవాలని, ఆధార్ సర్వీస్ పట్టిక బోర్డు గోడ పైకి అతికించాలన్నారు. 24 పంచాయతీల పరిధి గ్రామాల్లో సుమారు 1800 మంది చిన్నారులకు నేటికీ ఆధార్ అనుసంధానం లేదని, వారిని గుర్తించి తక్షణమే ఆధార్ నమోదు చేపట్టాలని సూచించారు.సచివాలయం సిబ్బంది 10:30 గంటలకు వచ్చి అటెండ్స్ వేసుకోవాలని సాయంత్రం 5: గంటల అనంతరం విధులు ముగించుకొని బయటికి రావాలని సూచించారు.

కెజిబివి ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-హుకుంపేట:స్థానిక కేజీబీవీ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ ఎన్.అనిత పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరవ తరగతిలో 40 సీట్లు, 10వ తరగతిలో మూడు సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు చొప్పున ఖాళీలు ఉన్నాయని ఆమె అన్నారు. మంచి భోజనాలతో కూడిన ఆహారం, నాణ్యమైన విద్య చక్కని తరగతి గదులు వంటి సౌకర్యాలు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:హైవే రోడ్డు నిర్మాణంకు తొలగించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఏర్పాటు చేసి పునరుద్ధరించాలని వైసిపి మండల నాయకుడు, మాజీ ఎంపీటీసీ టి రాందాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, విగ్రహాన్ని తొలగించి సుమారు ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు పునరుద్ధరించక పోవడం విచారకరమన్నారు తక్షణమే విగ్రహం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఇగ్నో అధ్యయన కేంద్రం సమన్వయకర్తల సమావేశం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వదాలయం (ఇగ్నో) 2025వ సంవత్సరానికి గాను విశాఖపట్నంలోని అధ్యయన కేంద్రాల సమన్వయకర్తల సమావేశం మంగళవారం ఉషోదయ వద్ద ఉన్న ప్రాంతీయ కేంద్ర ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్ర సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు మాట్లాడుతూ, దూరవిద్య విధానంలో అధ్యయన కేంద్రాలు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. విద్యార్థులకు, విశ్వవిద్యాలయానికి మధ్య అధ్యయన కేంద్రాలు అనుసంధానకర్తలుగా వ్యవహరించాలని కోరారు. ఇగ్నో ఎన్నో కొత్త సాంకేతిక మార్గాలకు దారులు తెరచి లక్షల మంది విద్యార్థులకు సేవలందిస్తుందని తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్ర ఉప సంచాలకులు డాక్టర్ ఓ.కృష్ణారావు ప్రస్తుత అధ్యయన, కొత్తగా ప్రారంభమైన వివిధ కోర్సుల వివరాలను వెల్లడించారు. అధ్యయన కేంద్రాల నిర్వహణ, ఆర్థిక అంశాలపై వివి.పతిరావునాయుడు వివరించారు.

ఇకెవైసి సర్వర్ అంతరాయంపై రేషన్ లబ్ధిదారుల ఆందోళన

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు: రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకోవడానికి మంగళవారం వందలాదిమంది మండల హెడ్ క్వార్టర్ కించాయి పుట్టు గ్రామ సచివాలయానికి తరలివచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ అప్డేట్, ఈకేవైసీ సెంటర్లో సాంకేతిక లోపం కారణాలతో నిరీక్షించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎ శ్రీను సచివాలయంలో డిఏతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.జడ్పీ గెస్ట్ హౌస్ వద్ద తాత్కాలికంగా నడుపుతున్న సచివాలయం వద్ద ప్రజలతో నిరసన తెలుపుతూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈకెవైసి సర్వర్ సక్రమంగా పని చేయలేదని, దీంతో, మారుమూల ప్రాంతాల గ్రామ పంచాయతీల నుంచి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.
' క్లస్టర్ పీసా ఉపాధ్యక్షుడు చిట్టపులి విశ్వనాథం పడాల్".. మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు పూర్తవుతున్నప్పటికీ నేటికీ ప్రభుత్వ పథకాలు అమలు చేయటంలో వైఫల్యం చెందిందన్నారు. ఆధార్ సెంటర్లో అంతరాయంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.. గత ఆరు నెలలుగా ఆధార్ సెంటర్లు సక్రమంగా నడవలేదని, సాంకేతిక లోపాలు, తదితర సమస్యలతో వచ్చిన ప్రజలకు నిరాశతో వెనక్కి పంపుతున్నారన్నారు. ఇకెవైసి కాకుంటే ప్రభుత్వ పథకాలు వర్తించవని,

ఆందోళన చేపడుతున్న గిరిజనులు

రేషన్ అందదని అధికారులు చెపుతున్నారన్నారు.సచివాలయంలో మూడు రోజులుగా ఉదయం నుండి సాయంత్రం వరకు వేచి చూస్తున్నప్పటికీ బిఎస్ఎన్ఎల్ నెట్ సిగ్నల్ లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మండల ఎంపీడీవో, తహసిల్దార్, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ప్రజల ఆవేదనను పరిగణంలో తీసుకొని అదనంగా ఆధార్ సెంటర్ ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ సమస్యపై కూటమి ప్రభుత్వము సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఐసిడిఎస్ ప్రాజెక్టుల పాడేరు, చింతూరు, రంపచోడవరం డివిజన్లలో అంగన్వాడీ కేంద్రములలో అంగన్వాడీ కార్యకర్తలు 7 పోస్టులు, ఆయాలు 56 పోస్టులు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 27 పోస్టులు, పియం జన్ మన్ స్కీంలో కొత్త గా మంజూరైన అంగన్వాడీ కేంద్రములలో ఆయాలు 24 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు 2025 మార్చ్ 26 నుండి ఏప్రిల్ 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు సంబంధిత శిశు అభివృద్ధి పథకం అధికారికి నేరుగా గాని పోస్ట్ ద్వారా గాని దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.
అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేయదలచిన మహిళలు తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. ప్రధానంగా స్థానికంగా నివాసం కలిగి ఉండాలని వివాహిత స్త్రీ అయి ఉండాలని తెలిపారు. 2025 జులై 1 నాటికి అభ్యర్థుల వయస్సు 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. 21 సంవత్సరాల లోపు అభ్యర్థులు లభించని పక్షంలో 18 సంవత్సరాలు పూర్తయిన వారి దరఖాస్తులు పరిశీలించబడతాయని, కేవలం ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు కేటాయించిన కేంద్రాలకే వర్తిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎంపికలో పదవ తరగతి ఉత్తీర్ణత 50 మార్కులు, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్ /క్రిష్ / ప్రీ స్కూల్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ ఇంటర్ మీడియట్ బోర్డ్ వారిచే లేదా గుర్తింపు పొందిన యూనివర్సిటీ ద్వారా పొందిన సర్టిఫికెట్ కలిగిన వారు లేదా సిఐసి వర్కర్ గా పని చేయుచున్న వారికి (ప్రైవేటు స్కూల్స్, కాన్వెంట్) పని చేస్తున్న వారి దరఖాస్తులు పరిగణించబడవు) కలిగి ఉన్న అభ్యర్థులకు ఐదు మార్కులు, వితంతువులకు ఐదు మార్కులు, మైనర్ పిల్లలు కలిగి ఉన్న వితంతువులకు ఐదు మార్కులు, పూర్తి అనాథ, క్రెచ్ హోమ్, ప్రభుత్వ సంస్థలలో నివశించి సత్ప్రవర్తన సర్టిఫికెట్ కలిగిన వారికి 10 మార్కులు, అర్హత కలిగిన వికలాంగ వ్యక్తులకు ఐదు మార్కులు, మౌఖిక పరీక్షకు 20 మార్కులు మొత్తం 100 మార్కులకు లెక్కిస్తారని తెలిపారు. మార్కుల ఆధారంగా పూర్తి పారదర్శకతతో నియామకాలు జరుగుతాయని ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు మధ్యవర్తులను, దళారులను నమ్మి మోస పోవద్దని, వారి అర్హతలు, మార్కులను పరిశీలించి ఎంపిక చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. పూర్తి వివరములకు సంబంధిత ఐసిడిఎస్‌లో సంప్రదించాలని తెలిపారు.

కునాల్ కమ్రా స్టూడియోపై దాడి తగదు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రాపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ముంబైలోని 'హేబిటేట్ స్టూడియో'పై కమలం పార్టీ, శివసేన షిండే గ్రూపు, ముంబై మున్సిపల్ సిబ్బంది కలిసి మూక దాడికి పాల్పడి కూల్చి వేయడాన్ని, స్టాండప్ కమెడియన్ కమ్రాను బెదిరించడాన్ని ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఖండించింది. కళాకారులపై ఇటువంటి దాడులు చేయడం దారుణం భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకొని కళాకారుల సృజనాత్మకతను, ప్రదర్శనకారుల స్వేచ్ఛను గొంతు నొక్కడం లాంటిదని, ఈ చర్యలను కవులు, కళాకారులు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు, అభ్యుదయ కాముకులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. కునాల్ కమ్రాకు అండగా నిలవాలని ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.చంటి, అధ్యక్షులు జి.రమణ, గౌరవాధ్యక్షులు దండు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.సత్యనారాయణ, సహాయ కార్యదర్శి జి.స్టాలిన్ కోరారు.

ఎఐవైఎఫ్ జాతీయ మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తిరుపతిలో మే 15,16, 17 తేదీల్లో జరగనున్న ఎఐవైఎఫ్ జాతీయ 17వ మహాసభలను జయప్రదం చేయాలని ఎఐవైఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి కోరారు. అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం మహాసభల సంబంధించిన 'లోగో'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగ యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదాని, అంబానీకి ఏవిధంగా కట్టబెట్టాలి అనే ఆలోచన తప్ప, దేశీయ సమస్యల పాలకులకు పట్టడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు వై.రాంబాబు, కె.అచ్యుతరావు, యు.నాగరాజు, మధు, శ్రీను, అశోక్ శివ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి ఇంట్లో నోట్ల కట్టలపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంటిలో సగం కాలిన నోట్ల కట్టలపై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ విచారణ జరపాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు విదసం ఫిర్యాదు చేసింది. ఎంవిపి కాలనీలోని సౌత్ రీజన్ సబ్ జోనల్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ నరేంద్రకు విదసం నాయకులు మంగళవారం సాయంత్రం ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ నగదు లావాదేవీల్లో ఎన్ని తీర్పులు ప్రభావితమయ్యాయో నిగ్గు తేల్చేందుకు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కన్వీనర్లు సోడదాసి సుధాకర్, గుడివాడ ప్రసాద్ పాల్గొన్నారు.

'మేయర్ పీఠం కూటమి కైవసం'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గి మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంటుందని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ తెలిపారు. జివిఎంసి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గడిచిన నాలుగేళ్ల అవినీతి, అక్రమాలతో పాలన సాగిందన్నారు. నైతికత కోసం మాట్లాడే హక్కు వైసిపికి లేదన్నారు. అభివృద్ధి కోసం స్వచ్ఛందంగా వైసిపి కార్పొరేటర్లు కూటమి పార్టీలలో చేరుతుంటే ప్రలోభాలు పెడుతున్నామని అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. జివిఎంసి బడ్జెట్ సమావేశాలు ఉన్నా వైసిపి నాయకులు క్యాంప్ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో 67వ వార్డు టిడిపి కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎఐ ఆధారిత ఎయిర్ కండిషనర్లు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : హయర్ ఇండియా ఎఐ ఆధారిత ఎయిర్ కండిషనర్లను విశాఖలో విడుదల చేసింది. సిరిపురంలోని హయర్ షో రూమ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హయర్ అప్లయెన్సెస్ ఇండియా అధ్యక్షుడు ఎన్ఎస్.సతీష్ మాట్లాడుతూ, గృహ అవసరాలకు అనుగుణంగా ఎఐ -ఆధారిత ఎయిర్ కండిషనర్లను పరిచయం చేయడం గర్వంగా ఉందన్నారు. ఇది ఇండస్ట్రీలో సరికొత్త బెంచ్ మార్క్‌ను నెలకొల్పుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా బాధితులకు పరిహారం అందజేశారు. ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలయిన గొంతిన అచ్చిబాబు, బర్లంగి వెంకట రమణ, గట్టు తులసీభాయ్‌లకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లోకి జమచేసినట్లు పోలీస్ కమిషనర్ కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. హిట్, రన్ కేసుల్లో సహాయం కోసం రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం, లేదా టోల్ ఫ్రీ నెంబర్ 7995095793ను సంప్రదించాలని సూచించారు.

వాటర్ ప్రూఫ్ ఒప్పో ఎఫ్ 29 ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలోని ఒక హోటల్లో ఒప్పో ఎఫ్ 29ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రోడక్ట్ మార్కెటింగ్ మేనేజర్ (కమ్యూనికేషన్) క్షితిజ్ అరోరా మాట్లాడుతూ, విలక్షణ వాతావరణాన్ని తట్టుకునే రీతిలో ఒప్పో ఎఫ్ 29 తయారు చేయబడిందని తెలిపారు. దీని ప్రారంభ ధర రూ.23,999, (8, 128 జిబి), ఎఫ్ 29 పిఆర్ఓ రూ. 25,999 (8, 256జిబి)ను అందుబాటులో ఉంచామన్నారు. తీవ్రమైన ఎండ, చలి, మంచు కలిగిన ప్రాంతాల్లో సైతం ఈ మొబైల్ ఫోన్ అత్యంత మన్నిక వస్తుందన్నారు. నీరు, వేడి, చల్లని పదార్థం ఫోన్‌పై పడినప్పటికీ ఎటువంటి సమస్యా లేకుండా, పడిపోయినప్పుడు విరిగిపోకుండా ఉండే అత్యధిక టెక్నాలజీని వినియోగించినట్లు వివరించారు.

శామ్‌సంగ్ ఉపకరణాలపై రాయితీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :ఉగాది పండుగను పురస్కరించుకొని శామ్‌సంగ్ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించిందని ఆ సంస్థ ప్రతినిధి శ్రీని తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎఐ ఆధారిత రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లు, ఎయిర్ కండిషనర్లు, మైక్రోవేవ్‌లు ఇప్పుడు అద్భుతమైన డీల్స్‌తో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పరిమిత కాలపు ఆఫర్లు ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎంచుకున్న డిజిటల్ ఉపకరణాలపై 48 శాతం వరకు తగ్గింపు, రూ.20 వేలు క్యాష్‌బ్యాక్ సులభమైన జీరో డౌన్ పేమెంట్ పొందవచ్చని పేర్కొన్నారు.

కూచిపూడి నృత్యకారిణి అపర్ణకు నారీ శక్తి పురస్కారం

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి ఏడోవార్డు పిలకవానిపాలేనికి చెందిన నాగోతి నర్సింగరావు మనవరాలు,కూచిపూడి నత్యకారిణి ఎస్ఎస్‌వి అపర్ణ న్యూఢిల్లీకి చెందిన దూప్రా దశక్ ఫౌండేషన్ నారీశక్తి పురస్కారానికి ఎంపికైంది. దేశంలో పలు రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలకు అందించే ఈ అవార్డుకు నృత్యవిభాగంలో అపర్ణను ఎంపిక చేసినట్లు నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందింది.. వచ్చేనెల 27న ప్రముఖసినీ నటి మయూరి సుధాచంద్రన్ అవార్డు అందజేస్తారని వెల్లడించారు. కూచిపూడి నృత్యకారిణి అపర్ణ ఇప్పటికే పలు రాష్ట్రాల్లో 500కు పైగా ప్రదర్శనలు ఇచ్చి,లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డు, మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్, సౌత్ ఇండియా ఆర్ట్ అండ్ కల్చర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదుతోపాటు పలు అవార్డులు సొంతం చేసుకున్నారు. ఇటీవల బెంగుళూరులో సౌత్ ఇండియా ఉమెన్ ఎచీవర్ అవార్డు పొందారు. ఈ సందర్భంగా 104 ఏరియాలో అపర్ణ చదివే నేవీ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు అపర్ణను అభినందించారు..

కూచిపూడి నృత్యకారిణి అపర్ణ

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి

సూచనలు చేస్తున్న విశాఖ డిఎంహెచ్ఒ జగదీశ్వరరావు

ప్రజాశక్తి- సీతమ్మధార: వైద్యసిబ్బంది సమయపాలన పాటించి, రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ .పి.జగదీశ్వరరావు సూచించారు. మంగళవారం జాలరిపేట సచివాలయాన్ని సందర్శించి, ఎన్‌సిడి 3.0, అభ ఐడి జనరేషన్, హెచ్‌బివైసి విజిట్స్‌ను స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం ఆర్,తాళ్లవలస పిహెచ్‌సిని సందర్శించి, వైద్యసేవలపై సమీక్షించారు. ఇన్, అవుట్‌పేషెంట్ సేవలు, వ్యాధినిర్ధారణ పరీక్షలు, మందుల నిల్వలు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పరిశీలించి, వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది ముఖహాజరుతోపాటు క్షేత్ర సందర్శనకు వెళితే మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది, ఎంపిహెచ్ఇఒ నాగభూషణం, పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 63వ వార్డు క్రాంతినగర్ గ్రామంలో ముస్లిం సోదరుల ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు. నమాజ్ అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, మసీదులో ఇమామ్ నిర్వహించే వారికి ప్రభుత్వం తరపున తోడ్పాటు అందుతుందన్నారు. కార్యక్రమంలో జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుడు గల్లా చిన్న, కూటమి నేతలు, ముస్లిములు పాల్గొన్నారు.

కొండపోడు భూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని వంతాడ గ్రామ గిరిజనుల సాగులో ఉన్న కొండపోడు భూములకు పట్టాల మంజూరు చేయాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ (వినోద్ మిశ్రా) ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఐటిడిఎ కార్యాలయం వద్ద మంగళవారం గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా (ప్రస్తుత కాకినాడ జిల్లా) ప్రత్తిపాడు మండలం ఈ.గోకవరం పంచాయతీ వంతాడ గ్రామంలో కొండదొర తెగకు చెందిన 83 గిరిజన కుటుంబాలు ఏలేశ్వరం రేంజ్ లింగంపర్తి సెక్షన్ లింగంపర్తి బీటు, కంపార్ట్మెంట్ నెంబర్ 589లో ఒక్కొక్క గిరిజన కుటుంబం 2 నుండి 3 ఎకరాలు చొప్పున జీడి మామిడి తోటలు వేసుకొని 40 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ గ్రామ పరిధిలో ఉన్న లక్షల కోట్ల విలువ చేసే ఖనిజ సంపదను దళారులు దోసుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది రాజకీయ పెద్దలు గిరిజనుల సాగులో ఉన్న కొండపోడు భూములకు పట్టాలు మంజూరు కానివ్వకుండా ప్రభుత్వ అధికారులకు అడ్డుపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనుల సాగులో ఉన్న కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, ఆంధ్రామైనింగ్ తవ్వకాలను

ధర్నా చేస్తున్న సంఘం నేతలు, గిరిజనులు

నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కోసిరెడ్డి గణేశ్వరరావు, సోమల కుశల, నాగులపల్లి అర్జునుడు, ఉల్లి తాతారావు, కూడే రాఘవ, మాతే దుర్గబాబు, ఉల్లి లవకుశల, మాతే లోవరాజు, ఈరట చంటిబాబు, మాతే లవకుశల, కూడే రెడ్డిబాబు, కూడే లోవరాజు, ఉల్లి లక్ష్మి, కోటిపల్లి కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎపిటోరియా ఫార్మా సిబ్బందికి శిక్షణ

స్నాతకోత్సవ సర్టిఫికెట్లతో ఫార్మా ఉద్యోగులు

ప్రజాశక్తి-మధురవాడ : అరబిందోఫార్మా లిమిటెడ్ అనుబంధ సంస్థ ఎపిటోరియా ఫార్మా ఉద్యోగులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో ప్రత్యేక మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమం (ఎమ్‌డిపి) మంగళవారం ముగిసింది. ఆరో అస్త్ర పేరిట నిర్వహించిన శిక్షణలో 34 మంది ఎపిటోరియా మధ్యస్థాయి మేనేజర్లకు సహ ఉద్యోగస్తులతో కలిసి బృందంగా పనిచేయడం, సంస్థ ప్రగతిలో వ్యక్తిగత నైపుణ్యాలను ఉపయోగించడం, కాలానుగుణ మార్పులను అర్థం చేసుకుని సవాళ్లను అధిగమించడం వంటివి అంశాల్లో శిక్షణనిచ్చారు. శిక్షణానంతరం స్నాతకోత్సవం నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు.

ఈ సందర్భంగా గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు మాట్లాడుతూ, పరిశ్రమలలోని నిపుణులకు సమకాలీన అంశాలపై శిక్షణ ఇవ్వడం సంస్థల ప్రగతికి దోహదపడుతుందన్నారు.. ఎపిటోరియా ఫార్మా సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ యు.ఎన్.బి.రాజు, ఆపరేషన్స్ విభాగం ఉపాధ్యక్షుడు రంగారావులు మాట్లాడుతూ గీతం శిక్షణతో సంస్థ ఉద్యోగులు మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారన్నారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఎన్.సాయిసుధాకర్, ఇతర ప్రొఫెసర్లు డాక్టర్ సాగి శ్రీలలిత, ప్రొఫెసర్ మనోజ్‌గౌర్, డాక్టర్ లుబ్నానిహర్, ఎపిటోరియా ఫార్మా విశాఖ క్లస్టర్ అధిపతులు మదన్, లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ సి.సుహస్‌రామ్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో మౌనికకు స్వర్ణం

ప్రజాశక్తి- సీతమ్మధార : తెనాలి ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా తైక్వాండో సిటీ లీగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల సివిల్ విభాగం ఫైనలియర్ విద్యార్థిని కె.మౌనిక మంచి ప్రతిభ కనబరిచి 67 కేజీల విభాగంలోరాష్ట్రస్థాయిలో బంగారు పతకాన్ని సాధించింది. ఉత్తరాఖండ్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే మన్యం జిల్లాపార్వతీపురంలో నిర్వహించిన 31వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలలో ఇంజనీరింగ్ కళాశాల ఇఇఇ విభాగం ఫైనలియర్ విద్యార్థి కె.బాలు 60-65 కేజీల విభాగంలో రజత పతకాన్ని సాధించాడు. పతకాలతో కళాశాల ప్రతిష్టను ఇనుమడింజేశారని విద్యార్థులను కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. మధుకుమార్ అభినందించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. దీపక్ చౌదరి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ యు.గంగాభవాని పాల్గొన్నారు.

యాదవులకు మేయర్ పదవి కేటాయించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : యాదవులకు మేయర్ పదవి కేటాయించాలని యాదవ సంఘం నాయకులు ఒమ్మి కనకరాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం పౌర గ్రంథాలయంలో 'నగర మేయర్ ఎన్నికపై చర్చ', నగర పాలక సంస్థలో యాదవ సామాజిక వర్గం పాత్రపై చర్చపై విశాఖ యాదవ సంఘం నాయకులు మీడియాతో మాట్లాడుతూ యాదవులకు సముచిత స్థానం కల్పిస్తారన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై పూర్తి నమ్మకం ఉందన్నారు. . అన్ని రంగాల్లో వెనుకబడిన యాదవ సామాజిక వర్గానికి కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. మేయర్ లేదా డిప్యూటీ మేయర్ స్థానాన్ని యాదవులకు ఇవ్వాలని కోరారు. యాదవ సంఘం నాయకులు పిన్నింటి ఆదిమూర్తి, నక్క పద్మ, మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, సుమన్, ఒమ్మి ఆనంద్, అల్లు రమణారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యాదవ సంఘం నేత కనకరాజు

చంద్రరావుకు పరామర్శ

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సంకాడ పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు, మాజీ జెడ్పిటిసి మామిడి చంద్రరావు అనారోగ్యంతో బాధపడుతుండగా, అతన్ని ఆ పార్టీ నాయకులు కంకిపాటి ప్రసాదు లోతా దేముడు మంగళవారం పరామర్శించారు. మామిడి చందర్రావు అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి ఎంపీటీసీ పోతురాజు విష్ణుమూర్తి, కంకిపాటి నారాయణ, చల్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రరావును పరామర్శిస్తున్న వైసిపి నేతలు

అమరావతిలో టిఎసి భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-దేవీపట్నం: ట్రైబల్ అడ్వైజర్ కమిటీ (టిఎసి) భవనం రాష్ట్ర రాజధాని అమరావతిలో తక్షణమే నిర్మించాలని ఎపి ఆదివాసీ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. జెఎసి రాష్ట్ర కార్యదర్శి రామన్న దొర అధ్యక్షతన దేవీపట్నం మండలం, ఇందుకూరు-1లో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతంలో పోరాట యోధుల ఫలితంగా వచ్చిన ఆదివాసీ హక్కులు, చట్టాలు, జీవోలు భవిష్యత్తులో కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. వాటికి భంగం కలగకుండా పరిరక్షణ కోసం టిఎసి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు చవలం శుభకృష్ణ దొర, మడకం వర ప్రసాద్ దొర, యలగాడ నాగేశ్వరరావు, కుండ్ల సాయి రామ్ రెడ్డి, నడిపూడి భానుశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆస్తి పన్ను పెంపు విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - మాధవధార : పట్టణాలు, నగరాలలో ఆస్తి పన్ను పెంపుదలకు గత ప్రభుత్వం జారీ చేసిన మున్సిపల్ ఆస్తిపన్ను సవరణ చట్టం 44/2020, జిఒ 198లను వెంటనే నిలిపివేయాలని పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు ప్రభుత్వాన్ని కోరారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం నుండి 0.25 శాతం అదనపు అప్పు పొందేందుకు చట్ట సవరణచేసి ప్రజలపై శాశ్వతభారాన్ని మోపారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించి, తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామనిఎన్నికల్లో వాగ్దానం చేశారన్నారు. అయితే నేటికీ దీనిపై సమీక్షించలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. రిజిస్ట్రేషన్ విలువకు ఆస్తి పన్ను లింకు చేయడం వల్ల, ప్రభుత్వం ఆస్తుల మార్కెట్ విలువను పెంచిన ప్రతిసారి ఆస్తి పన్ను పెరిగిపోతుందన్నారు. ఏటా 15శాతం పెంచిన ఆస్తి పన్ను ఇపుడు వందశాతం దాటిందన్నారు. వచ్చేనెల నుంచి విధించాలనుక్ను 15శాతం అదనపు పన్ను రద్దుచేసి పట్టణ ప్రజలకు మేలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జెడ్‌పి అతిథి గృహం మరమ్మతులకు నిధులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జెడ్‌పి అతిథి గృహం మరమ్మతులకు రూ.20లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర వెల్లడించారు. మంగళవారం భీమిలిలో పర్యటించి, మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, సింగనబంద సర్పంచ్ జివి.నారాయణ, ఎంపిడిఒ ఎన్ హనుమంతరావు, ఇఒపిఆర్‌డి కె రమేష్‌నాయుడు, సిబ్బంది స్వాగతం పలికారు.అనంతరం మరమ్మతుక గురైన జెడ్‌పి అతిథి గృహాన్ని పరిశీలించారు. నూకాలమ్మ ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గాడు తాతినాయుడు , పంచాయతీరాజ్ డిఇఇ జగదీష్ బాబు పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్‌పర్సన్‌ను అభినందిస్తున్న జెడ్‌పిటిసి, తదితరులు